క్లుప్తంగా

విద్యార్థులకు నోట్‌పుస్తకాల అందజేత



పంపిణీ చేసిన పుస్తకాలతో విద్యార్థులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారం గ్రామ నేచర్ ఐకాన్ యూత్ ఆధ్వర్యంలో గ్రంథాలయం వద్ద ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. ఆదివారం విద్యార్థులకు పలు అంశాలపై పదో తరగతి పరీక్షలకు ఇప్పటి నుంచే ఓ ప్రణాళిక ప్రకారం ఎలా చదువుకోవాలో సూచించారు. అనంతరం విద్యార్థులకు జీఎమ్మార్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లైబ్రరీ వలంటీర్ కిరణ్, నేచర్ ఐకాన్ యూత్ అధ్యక్షుడు స్వామి, యువత పాల్గొన్నారు.

దాతల సహాయంతో సీసీ నిర్మాణం



ఆలయం వద్ద నిర్మిస్తున్న సీసీ రోడ్డు

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయం వద్ద దాతల సహాయంతో సీసీ రోడ్డు నిర్మాణం పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఆలయ పరిసరాల్లో సీసీరోడ్డు పూర్తిస్థాయిలో లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇది గమనించిన ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ఈఓ శ్రీనివాస్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వస్తురూపంలో సిమెంట్, ఇసుక, కంకర సేకరించి సీసీ పనులు చేయిస్తున్నారు. వస్తురూపంలో దాతలు అందించిన సుమారు రూ.15 లక్షల నిధుల ద్వారా సీసీ నిర్మిస్తున్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు



ఆలయం వద్ద పోసిన మొరం

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని దొంతి గ్రామ శివారులో ఉన్న పురాతన పిలిగుండ్ల వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేశారు. ఆలయ పరిసరాలు పిచ్చిమొక్కలతో నిండిపోవడంతో దొంతి గ్రామవాసి భవనగారి శ్రీనివాస్ ఆదివారం తన సొంత నిధులతో పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు తొలగించి 100 ట్రిప్పుల మొరం పోయించి చదును చేయించారు. ఆలయం వద్ద వసతుల కల్పనకు కృషి చేయడంపై దొంతి, శభాష్‌పల్లి గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

దుర్వాసనతో ఇబ్బందులు



వ్యర్థాలను చూపుతున్న కాలనీవాసులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలోని చికెన్, మటన్ దుకాణదారులు ఇష్టారాజ్యంగా వ్యర్థాలు వదిలేస్తున్నారు. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మాంసం విక్రయాల సముదాయాల వద్ద ఇష్టరీతిలో జీవాల వ్యర్థాలు బయటకు వదిలేస్తుడడంతో తీవ్ర దుర్వాసనతో సమీప కాలనీ వాసులు అవస్థలు పడుతున్నారు. సంబంధిత వ్యాపారులకు చెప్పినా.. పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు లస్కరి రాములు, భిక్షపతి, గౌండస్వామి, తదితరులు అన్నారు. దుర్వాసనతో రోగాల బారిన పడాల్సి వస్తుందని వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి వ్యర్థాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

బండ్ల ఊరేగింపు

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని గ్రామ దేవత మాత బోరంచమ్మ అమ్మవారికి ప్రజలు ఆదివారం రాత్రి బండ్ల ఊరేగింపును నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి పట్టణంలోని పలు వార్డుల భక్తులు తమ ఎడ్ల బండ్లను అలంకరించి అమ్మవారి ఆలయం చుట్టూ ఊరేగించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

రుణమాఫీపై హర్షం

శివ్వంపేట(నర్సాపూర్): రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయడంపై తెలంగాణ రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మైసయ్యయాదవ్ హర్షం వ్యక్తం చేశారు.

నిరుపయోగంగా వైకుంఠధామాలు

- సొంత భూముల్లోనే అంత్యక్రియలు
- అవగాహన లేక నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం
- పట్టించుకోని అధికారులు



మాడాపూర్‌లో అటవీ ప్రాంతంలో గుట్టపై నిర్మించిన శ్మశానవాటిక

నర్సాపూర్ రూరల్: పల్లె ప్రగతిలో భాగంగా గ్రామాల్లో గత ప్రభుత్వ హ యంలో నిర్మించిన వైకుంఠధామాలు నిరుపయోగంగా మారాయి. నిర్మాణాలు పూర్తయి రెండేళ్లు అవుతున్నా.. ఆయా గ్రామాల ప్రజలు వాటిని వినియోగించుకునేందుకు ముందుకు రావడం లేదు. అవగాహన కల్పించి వినియోగంలోకి తీసుకురావాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన వైకుంఠధామాలు ప్రస్తుతం కొన్ని గ్రామాల్లో అలంకారప్రాయంగా మారాయి. నర్సాపూర్ మండలంలోని 34 గ్రామపంచాయతీల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఒక్కో వైకుంఠధామానికి రూ.12.60 లక్షల మంజూరు చేసి, నిర్మాణాలు ప్రారంభించారు. నిర్మాణాలు పూర్తయినా.. అందులో బర్నింగ్ షెడ్, టాయిలెట్స్, విద్యుత్, నీటి సౌకర్యం కల్పించాల్సి ఉంది. అచ్చంపేట, రుస్తుంపేట, అద్మాపూర్‌లో నిర్మాణ పనులు అసంపూర్తిగా వదిలేశారు. ప్రస్తుతం అంత్యక్రియలను నిర్వహించే పరిస్థితి లేదు. తుజాల్‌పూర్, పెద్దచింతకుంట, నారాయణపూర్ తదితర గ్రామాల్లో అప్పటి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి వైకుంఠధామాలను ఆర్భాటంగా ప్రారంభించారు. తూజల్‌పూర్, పెద్దచింతకుంట, రామచంద్రాపూర్ ఆయా గ్రామాల్లో మాత్రమే ఆడపదడపా వినియోగిస్తున్నారు. మాడాపూర్, గూడెంగడ్డ, మరికొన్ని గ్రామాల్లో అనువుగాని చోట శ్మశాన వాటికలు నిర్మించడంతో వాటిని గ్రామస్తులు వాడడం లేదు. మిగతా గ్రామాల్లో వైకుంఠధామాలు ప్రారంభించగా.. ఇప్పటివరకు ఏ ఒక్కరి అంత్యక్రియలను నిర్వహించలేదు. వైకుంఠధామాలు ఉన్నా.. చాలా వరకు వారి సొంత భూముల్లోనే అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అసంపూర్తిగా నిర్మాణాలు



అసంపూర్తిగా ఉన్న వైకుంఠధామలను పూర్తి చేయించాలి. నిర్మాణం పూర్తయిన వైకుంఠధామాల్లో అంత్యక్రియలు జరిపేలా గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలి. గత ప్రభుత్వం ఆర్భాటంగా శ్మశాన వాటికలకు నిధులు మంజూరు చేసి, బిల్లులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసింది. చాలా గ్రామాల్లో బిల్లులు రాకపోవడంతో అసంపూర్తిగా నిర్మాణాలున్నాయి.

– గుడ్రాల అశోక్, మాజీ సర్పంచ్ రుస్తుంపేట

చర్యలు తీసుకుంటాం



నర్సాపూర్ మండలంలోని 34 గ్రామపంచాయతీల్లో వైకుంఠధామాలు నిర్మించాం. రుస్తుంపేట, అచ్చంపేట, అద్మాపూర్‌లో పనులు అసంపూర్తిగా ఉన్నాయి. నిర్మాణాలు పూర్తయిన కొన్ని వైకుంఠధామాల్లో విద్యుత్, తాగునీళ్లు, పైపులైన్ల కనెక్షన్, ప్రహరీ తదితర చిన్నచిన్న పనులు మిగిలి ఉన్నాయి. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోవడంతో పనులు అసంపూర్తిగా వదిలేశాం. బిల్లులు రాగానే పనులు పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.

– స్వామి దాస్, పీఆర్ ఏఈ నర్సాపూర్

వైభవంగా అమ్మవారి ఆలయ వార్షికోత్సవం



కన్యకాపరమేశ్వరీ అమ్మవారికి 56 రకాల నైవేద్యాలు సమర్పించిన మహిళలు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా ఆదివారం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలను చేసి, 56 రకాల నైవేద్యాలను సమర్పించారు. అనంతరం హోమం, నగరేశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు. భక్తుల సౌక ర్యార్థం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాజేశ్వర్, హన్మయ్య, నగేశ్, కూన రాములు, ఎర్రమల్లి నాగరాజు, మహేశ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అల్లాదుర్గం(మెదక్): ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

అల్లాదుర్గం(మెదక్): మండలంలోని ముస్లాపూర్ గ్రామంలో పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అల్లాదుర్గం జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో 1987 – 88 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు చదువుల అనంతరం వివిధ ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడ్డారు. 36 ఏళ్ల తర్వాత ఆత్మీయంగా కలుసుకొని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్య నేర్పిన అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో 2000–2001బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బాల కిషన్, అశోక్, ఇలియాస్, మహేష్, శంకర్, భిక్షపతి, వేణు, ప్రవీణ్, అర్జున్, యాదుల్, తదితరులు పాల్గొన్నారు.



కౌడిపల్లి మండల కేంద్రంలో..

పర్యావరణ రక్షణకు అగ్నిహోత్రం



గడిపెద్దాపూర్‌లో సామూహిక అగ్నిహోత్రం చేస్తున్న ఫౌండేషన్ సభ్యుడు

అల్లాదుర్గం(మెదక్): నిత్యం అగ్నిహోత్రం చేయడంతో పర్యవరణాన్ని రక్షించడంతో పాటు ప్రజల్లో ఆధ్యాత్మికత పెరుగుతుందని విశ్వఫౌండేషన్ సభ్యుడు సుధాకర్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని గడిపెద్దాపూర్ గ్రామంలో అగ్నిహోత్రంపై ప్రజలకు అవగాహన కల్పించి, సాముహిక అగ్నిహోత్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రపంచంలో పర్యవరణానికి ముప్పు పొంచి ఉందని, ప్రతీ ఒక్కరూ తమ ఇళ్లలో రోజు ఉదయం, సాయంత్రం వేళ అగ్నిహోత్రం చేయడంతో పర్యవరణాన్ని కాపడటంతో పాటు, కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంతో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లలితాపరమేశ్వరీ ఆలయం వార్షికోత్సవాలు

తూప్రాన్: మున్సిపల్ పరిధిలోని వెంకటాపురం (పీ.టీ)లో కొలువైన లలితా పరమేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు ఆలయ వ్యవస్థాపకుడు సోమయాజుల రవీంద్రశర్మ ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారికి మహాపూజ, చండీయాగం, మహాన్యాస పూర్వక శత రుద్రాభిషేకం చేశారు. చిన్నారులకు తులాభారం యాదగిరిగుట్ట నుంచి విచ్చేసిన సురేశ్ బృందం ఆధ్వర్యంలో భజన నిర్వహించారు.



తులాభారం నిర్వహిస్తున్న రవీంద్రశర్మ

శ్యాంప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివి



శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

పెద్దశంకరంపేట(మెదక్): జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యాంప్రసాద్ ముఖర్జీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. దేశసమైక్యతకు, సమగ్రత కోసం పోరాడిన వ్యక్తి ఆశయసాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రావణ్, విజయ్, అనిల్ తదితరులున్నారు.

రామాయంపేట(మెదక్): పట్టణంలో ఆదివారం బీజేపీ మున్సిపాలిటీ శాఖ ఆధ్వర్యంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. ముఖర్జీ ఏర్పాటు చేసిన భారతీయ జనసంగ్ అలాగే కాలక్రమేపి భారతీయ జనతా పార్టీగా ఆవిర్భవించిందని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు భానుచందర్, పట్టణ ప్రధాన కార్యదర్శి శీలం అవినాష్ రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర సీనియర్ నాయకులు వెలుముల సిద్ధరాములు, చింతల శేఖర్, బూత్ ఇన్‌చార్జిలు నాగరాజు, కన్నయ్య, దోమకొండ శ్రీనివాస్, అక్కల అనిల్, మహేశ్, నరేష్ యాదవ్, రమేశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అభయ హస్తం అమలు చేయాలి

డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్



మాట్లాడుతున్న శంకర్

గజ్వేల్‌రూరల్: అంబేడ్కర్ అభయ హస్తం పథకానికి మార్గదర్శకాలను రూపొందించి వెంటనే అమలు చేయాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద డీబీఎఫ్ ఆధ్వర్యంలో ప్రదర్శన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడారు. దళితబంధు పథకం స్థానంలో అంబేడ్కర్ అభయహస్తం పథకాన్ని రూ.12 లక్షలకు పెంచి అమలు చేస్తామని ఇచ్చిన హామీ హామీగానే మిగిలిపోయిందన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురిపై కేసు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం సాయంత్రం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురిని పట్టుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపడం నేరమన్నారు. పట్టుబడిన వారిని సిద్దిపేట కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

అంబాజిపేటలో తాగునీటి తిప్పలు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని అంబాజిపేటలో మిషన్ భగీరథ నీటి సరఫరా సక్రమంగా జరగడంలేదు. దీంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం గ్రామంలో మిషన్ భగీరథ నీటిసరఫరా సక్రమంగా జరగకపోవడంతో కాలనీల్లో ఉన్న బోర్ల వద్ద మహిళలు బిందెలతో గంటల కొద్ది నిలబడి నీళ్లు పట్టుకుంటున్నారు. ఈ విషయం అధికారులకు చెప్పినా.. పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయంపై ఎంపీడీఓకు ఫోన్ చేసిన స్పందించడం లేదని తెలిపారు. అధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.



బోరువద్ద బారులుతీరిన మహిళలు

ఘనంగా ఒలింపిక్ దినోత్సవం



రామాయంపేటలో సైకిల్‌ర్యాలీ నిర్వహిస్తున్న సైక్లింగ్ సెంటర్ కోచ్ యాదగిరి

రామాయంపేట(మెదక్): అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఆదేశానుసారం పట్టణంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. క్రీడల ప్రాముఖ్యత లాంగ్ లీవ్ స్పోర్ట్స్ అంటూ నినాదాలతో ఈ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా రామాయంపేట ఖేలో ఇండియా సైక్లింగ్ సెంటర్ కోచ్ యాదగిరి మాట్లాడుతూ.. 23 జూన్ 1896లో గ్రీకు దేశంలోని ఏథెన్స్ నగరంలో ఈ ఒలింపిక్ క్రీడలు ప్రారంభమయ్యాయన్నారు. క్రీడల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడమే ఈ ఒలింపిక్ డే ముఖ్య ఉద్దేశం అన్నారు. కార్యక్రమంలో ధ్యాన్‌చంద్ పీఈటీల సంఘం సభ్యులు ప్రసాద్ పాల్గొన్నారు.

ఖేడ్‌కు వెళ్లే దారిని విస్తరించాలి

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రం నుంచి నారాయణఖేడ్‌కు వెళ్లే దారిని రెండు వరుసలుగా విస్తరించాలని మండల ప్రజలు కోరుతున్నారు. నిత్యం వివిధ పనులపై పెద్దశంకరంపేట నుంచి వయా హన్మంత్‌రావు పేట మీదుగా నారాయణఖేడ్‌కు ఇక్కడి ప్రజలు వెళ్తుంటారు. ఏళ్ల క్రింతం నిర్మించిన సింగిల్ రోడ్డుపై వెళ్లాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిపై ప్రస్తుతం రాకపోకలు భారీగా పెరిగాయి. ఈ రహదారి విస్తరణ జరిగితే నిజాంపేట నుంచి ప్రస్తుతం జరుగుతున్న బీదర్‌కు వెళ్లే జాతీయ రహదారికి కలిసే అవకాశం ఉంటుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ విషయంపై స్పందించి డబుల్‌రోడ్డుగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.



పెద్దశంకరంపేట నుంచి నారాయణఖేడ్‌కు వెళ్లే రహదారి

శిఖంలో అర్ధరాత్రి మట్టి తవ్వకాలు

శివ్వంపేట(నర్సాపూర్): నిబంధనలకు విరుద్ధంగా చెరువు శిఖం భూముల్లో నుంచి అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. తూప్రాన్ – నర్సాపూర్ హైవే పక్కన ఉన్న చిన్నగొట్టిముక్ల గ్రామ శివారులోని బాయన్న చెరువు శిఖం భూముల్లో నుంచి శనివారం అర్ధరాత్రి హిటాచి ద్వారా తవ్వకాలు చేపట్టి టిప్పర్ల ద్వారా మట్టి తరలించారు. ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరుపుతున్నా.. సంబంధిత ఇరిగేషన్ శాఖ చూసి చూడనట్లు వ్యవహరించడం వల్లనే మట్టి తరలింపు జరుగుతుందని పలువురు ఆరోపించారు. ఈ విషయం గురించి ఇరిగేషన్ ఏఈ సునీత వివరణ కోరగా.. బాయన్న చెరువులో మట్టి తవ్వకాలు జరుగుతున్న విషయం మా దృష్టికి వచ్చిందని సిబ్బందిని పంపించామని చెప్పారు.



బాయన్న చెరువులో మట్టి తవ్వకాలు

చాముండేశ్వరి ఆలయంలో భక్తుల పూజలు



చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



మనోహరాబాద్(తూప్రాన్): బంగారమ్మను దర్శించుకుంటున్న భక్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని చిట్కుల్ శివారులో మంజీరా తీరాన వెలసిన చాముండేశ్వరి దర్శనానికి ఆదివారం వివిధ ప్రాంతాల భక్తులు వచ్చారు. అమ్మవారిని దర్శనం చేసుకొని, ఓడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ.. అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు.

నల్లపోచమ్మదేవి ఆలయంలో భక్తుల రద్దీ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్ల పోచమ్మదేవి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావు, జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివ్వప్ప, రాజేశ్ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి, ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద డప్పు చప్పుళ్ల శివసత్తుల పూనకాలతో అమ్మవారి ఆలయ ప్రాంగణం సందడి నెలకొంది. భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ గ్రామ శివారులోని బంగారమ్మా అమ్మవారిని పలు గ్రామాల భక్తులు దర్శించుకొని తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వనభోజనాలు చేశారు.

ఆలయ స్థలం వివాదంలో ఘర్షణ



ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని ఆరెగూడెం గ్రామంలో గడిమైసమ్మ ఆలయ స్థలం విషయంలో గత కొన్ని నెలలుగా వివాదం కొనసాగుతోంది. గ్రామంలోని గడిమైసమ్మ ఆలయాన్ని సుమారు ఎనిమిదేళ్ల క్రితం గ్రామస్తులు నిర్మించారు. ఆలయ స్థలం పక్కన స్థలాన్ని కొనుగోలు చేసిన కొడె మాధవి ఇటీవల నూతనంగా ఇంటిని నిర్మించారు. నిర్మాణ పనులు ప్రారంభం అయినప్పటి నుంచి ఆలయాన్ని పాత స్థలంలోనే నిర్మించాలంటూ గ్రామానికి చెందిన గోవింద్‌రెడ్డి, మరోవైపు మాధవి, ఆమెకు స్థలం విక్రయించిన ప్రతాప్‌రెడ్డిల మధ్య కొన్ని నెలలుగా వివాదం కొనసాగుతుంది. ఇదే విషయంలో ఆదివారం మరోసారి వాగ్వాదం జరగగా ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు.

క్రికెట్ టోర్నీ విజేత దుబ్బాక

దుబ్బాకటౌన్: 15 రోజులుగా చిన్న గుండవెల్లిలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్‌లో దుబ్బాక ఎంసీఎఫ్ టీం విజేతగా నిలిచింది. ఆదివారం దుబ్బాక ఎంసీఎఫ్‌కు లింగారెడ్డిపల్లి టీంకు ఫైనల్ మ్యాచ్ రసవత్తరంగా సాగింది. ముందుగా బ్యాటింగ్ చేసిన లింగారెడ్డి పల్లి టీం నిర్ణీత 12 ఓవర్లలో 102 పరుగులు చేసింది. 103 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఎంసీఎఫ్ టీం నాలుగు బాల్స్ మిగిలి ఉండగానే 7 వికెట్లతో తేడాతో లక్ష్యాన్ని ఛేదించింది. అనంతరం నిర్వాహకులు విజేత ఎంసీఎఫ్ టీంకు రూ.30 వేల నగదు బహుమతి, కప్పు అందజేశారు. ఫైనల్ మ్యాచ్ వీక్షించడానికి పలు గ్రామల నుంచి యువకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.